# తల్లిదండ్రులను సంతోషపెట్టండి, అదే నాకు సంతోషము

Youth (యువత) అనగా లేతవయస్సులో ఉన్నవారని, లేక, యౌవనంలో ఉన్నవారని భావించరాదు. ఉత్సాహం, సాహసం, ధైర్యం, భక్తి, శక్తి, పరాక్రమములనే ఆరు గుణములచేత తమ హృదయాన్ని నింపుకొన్నవారే నిజమైన యువతీ యువకులని చెప్పవచ్చును. మన సాయియువతలో ఈ ఆరు గుణములు పరిపూర్ణంగా ఉండాలి. ఈనాడు సమాజంలో సద్గుణవంతులైన యువతీ యువకులు కరవైపోయారు. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములనే అరిషడ్వర్గములతో యువతీ యువకులు తమ హృదయాన్ని నింపుకుంటున్నారు.

ప్రేమస్వరూపులైన యువతీ యువకులారా! మానవత్వములోనే దివ్యత్వ మున్నది. కాని, మీరు దుర్గుణములను, దురాచారములను పెంచుకొని సద్గుణములను, సచ్చింతనలను దూరం గావించుకోవడంచేత మీలో ఉన్న దివ్యత్వము మరుగునపడిపోతున్నది. ముఖ్యంగా యౌవనమునందు మీ హృదయంలో పరిశుద్ధమైన భావాలను నింపుకోవాలి. పవిత్రమైన కార్యములను చేపట్టాలి. 'బ్రదర్స్ అండ్ సిస్టర్స్' మాదిరి మీరు జీవించాలి. సద్గుణములు, సద్బుద్ధి, సత్యనిరతి, భక్తి, క్రమశిక్షణ, కర్తవ్యపాలనము ఇత్యాది పవిత్రమైన గుణములు మీయందు పరిపూర్ణముగా ఉండాలి. మీరిక్కడికి వచ్చి నేర్చుకున్నది ఏమిటని కొంత విచారణ చేయండి. భారతదేశమునకు ఆదర్శప్రాయులు మీరే! సమాజమునకు మార్గదర్శకులు మీరే! దేశమును ఉద్ధరించగల ఉత్తమ శక్తులు మీరే! ప్రజలకు ఆదర్శమునందించి, ఆనందమును, ఆహ్లాదమును చేకూర్చగల పవిత్ర వ్యక్తులు మీరే! మీ సోదరసోదరీమణులకు ఆదర్శమునందించడమే మీ కర్తవ్యము. జీవితములో యౌవనము చాలా ప్రధానమైనది. దీనిని మీరు వ్యర్థం గావించుకోకూడదు. తోటిమానవులకు తోడ్పడి,

sri sathyasai vahini amrutam

వారిలో సద్గుణములను అభివృద్ధి పరచి, వారిని సత్కార్యములలో ప్రవేశపెట్టాలి. ఈనాడు లోకములో ఎక్కడ చూసినా అశాంతి, అనాచారములు గోచరిస్తున్నాయి. ఇంక, యువతీ యువకుల సంగతి వేరే చెప్పనక్కర్లేదు. ఇలాంటి పరిస్థితిలో మన సాయియువత లోకానికి ఆదర్శప్రాయులుగా నిలవాలి. ప్రాచీనకాలంలో భారతదేశమునందు అనేకమంది స్త్రీ, పురుషులు దివ్యత్వమును గురించి ప్రచార ప్రబోధలు సల్పుతూ గొప్ప కీర్తిని సాధించారు. కాని, మధ్యకాలములో ఇట్టి పవిత్రమైన ప్రవర్తన సన్నగిల్లింది. భక్తిశ్రద్ధలు, వినయవిధేయతలు కలిగిన విద్యార్థులవలననే దేశం అభివృద్ధి చెందగలదు. దైవప్రీతి, పాపభీతి, సంఘనీతి – ఈ మూడింటినీ మీరు పెంచుకోవాలి.

పాపభీతి లేని పామరత్వము బట్టి
దైవప్రీతిలేని దానిబట్టి
మానవత్వమణగె మానవులందున
విశ్వశాంతి కిదియె విప్లవంబు

ఈనాడు పాపభీతి సన్నగిల్లి, పాపప్రీతి పెరిగిపోయింది. దైవభక్తి అంటే ఎవరికీ అర్థం కావడం లేదు. దైవాన్ని ప్రేమించడమే దైవభక్తి. నీతి నియమాలే మానవునికి ప్రధానమైన అంగములు. ఈనాడు సైన్సు అభివృద్ధి అయ్యేకొలదీ మానవత్వం దిగజారిపోతున్నది. ఏమిటీ సైన్సు? దీనిలో ఉన్న గొప్పతనమేమిటి? సైన్సు సమాజాభివృద్ధికి తోడ్పడాలేగాని, విధ్వంసకరమైనబాంబుల తయారీకి కాదు. ఈ విశ్వమనేది ఒక మహావృక్షమువంటిది. ఈ వృక్షముయొక్క కొమ్మలను, రెమ్మలను మాత్రమే చూసేవాడు Scientist దీనికి మూలాధారమైన వేర్లను చూసేవాడు Saint. మనం వేర్లను చూడాలిగాని, కేవలం కొమ్మలను, రెమ్మలను చూసుకుంటూ పోకూడదు. అనగా, ఈ జగత్తుకు మూలాధారమైన భగవత్తత్త్వంపై మనం దృష్టి పెట్టాలి. భగవంతుడు ఎక్కడున్నాడు? ఒకానొక సమయంలో నారదుడు మహావిష్ణువు దర్శనార్థం వెళ్ళినప్పుడు, 'స్వామీ! నేను త్రిలోకసంచారిని కదా! ఈ ప్రపంచంలో జరిగే మంచిచెడ్డలను మీకు ఎప్పటికప్పుడు విన్నవించుకోవడానికి నాకు మీ పర్మనెంటు అడ్రసు కావాలి,' అన్నాడు. అప్పుడు మహావిష్ణువు, "మద్భక్తః యత్ర గాయన్తి

srisathyasaivachanamrutam

తత్ర తిష్ఠామి నారద!" అన్నాడు. "తిరుపతి, బదరీనాథ్, అమరనాథ్, కేదార్‌నాథ్ మొదలైన పుణ్యక్షేత్రాలన్నీ కేవలం 'బ్రాంచాఫీసు అడ్రసులు' మాత్రమే. నా శాశ్వతమైన అడ్రసు భక్తులయొక్క హృదయమే" అని చెప్పాడు.

**హృదయం నుండి హృదయానికి... అదే ప్రేమతత్త్వం**

ప్రేమస్వరూపులారా! మీరెక్కడికి వెళ్ళినప్పటికీ ఎవరిని కలుసుకున్నప్పటికీ మీరు నేర్చుకున్న పవిత్రమైన భావాలను వారిలో నాటాలి. మీరీనాడు 'యూత్ క్యాంప్' పెట్టుకున్నారు. ఎందుకోసం? సద్గుణములను పోషించడమే ఈ 'యూత్ క్యాంప్'యొక్క ముఖ్యోద్దేశము. ఆదర్శవంతమైన 'యూత్'గా మీరు తయారు కావాలి. ప్రేమను అభివృద్ధిపరచుకోవాలి. ప్రేమంటే ఏమిటో మీరు అర్థం చేసు కోవడం లేదు. ప్రేమ మానవునికి ప్రాణసమానమైనది. ప్రేమయే దైవత్వము. మీలో ప్రేమ ఉన్నదిగాని, దానిని మీ బంధుమిత్రులపైన ప్రసరింపజేస్తున్నారు. ఇది నిజమైన ప్రేమ కాదు. అన్నదమ్ముల ప్రేమ, అక్కచెల్లెళ్ళ ప్రేమ, బంధు మిత్రుల ప్రేమ.... ఇవన్నీ లౌకికమైన ప్రేమలు, వచ్చిపోయే మేఘములవంటివి. కాని, దైవప్రేమ సత్యమైనది, నిత్యమైనది. ఒక్కతూరి అది మీదగ్గరకు వచ్చెనా, తిరిగి పోదు. అట్టి ప్రేమను మీరు అభివృద్ధి గావించుకోవాలి. ఏకాత్మతత్త్వముపై మీ ప్రేమను ప్రసరింపజేయాలి. హృదయానికి హృదయమును అందించాలి. ఇలాంటి ప్రేమను పోషించుకోవడమే నిజమైన భక్తి. దీనిని మీరు అభివృద్ధి గావించుకొని సమాజంలో ప్రచారప్రబోధలు సల్పాలి. పవిత్రమైన ఏకాత్మ భావమును, వజ్రసంకల్పమును అభివృద్ధిపరచుకున్నప్పుడే మీరు నిజమైన మానవులుగా రూపొందుతారు. ప్రేమతత్త్వము గ్రంథములద్వారా లభించేది కాదు. ఇది Heart to heart, హృదయమునుండి హృదయానికి రావాలి. ఇట్టి ప్రేమను మీరు పెంచుకున్నప్పుడే జగత్తునకు దివ్యమైన ఆదర్శమును అందించినవారవుతారు. ఈనాడు ప్రపంచంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు మాటల్లో చెప్పడానికి వీలుకానివి. ఎవరిని చూసినా అశాంతితో కుమిలిపోతున్నారు. దీనికి కారణం దుర్గుణములు, దురాచారములే! కాబట్టి, మీరు సద్గుణములను అభివృద్ధిపరచుకొని సదాచారసంపన్నులు కావాలి. అందరిలో ఉన్న ఆత్మతత్త్వాన్ని విశ్వసించాలి. కాని, ఈనాటి మానవునికి ఆత్మవిశ్వాసమే లేకపోతున్నది.

sri sathyasai vachanamrutam

ఇతరులు మనలను గౌరవించినా, గౌరవించక పోయినా మొట్టమొదట మనం ఇతరులను గౌరవించడం నేర్చుకోవాలి. ఎందుకంటే, అందరిలో దైవమున్నాడు కాబట్టి.

**ఆదర్శమూర్తి అబ్రహాం లింకన్**

పూర్వం అమెరికా అధ్యక్షపీఠాన్ని అధిరోహించిన అబ్రహాం లింకన్ చాలా బీదకుటుంబములో జన్మించాడు. తల్లి చినిగిపోయిన గుడ్డలు కుట్టి డబ్బు సంపాదించేది. లింకన్ రాత్రిపూట వీధిదీపాల దగ్గర కూర్చుని చదువుకునేవాడు. ధరించడానికి సరియైన దుస్తులు కూడా అతనికి ఉండేవి కావు. ఒకనాడతను తోటివిద్యార్థులతో కలసి స్కూలుకి వెళుతుంటే వాళ్ళు అతని దుస్తులను చూసి గేలి చేశారు. లింకన్ ఏడుస్తూ ఇంటికి వచ్చి, 'అమ్మా! నా దుస్తులను చూసి తోటిపిల్లలు హేళన చేస్తున్నారు. నాకుమంచిదుస్తులుకావాలి' అన్నాడు. తల్లి చాలా గుణవంతురాలు. "నాయనా! మన ఇంటి పరిస్థితిని చక్కగా అర్థం చేసుకో. ఎవరు నిన్ను అగౌరవపరచినప్పటికీ నీవు మాత్రం ఎవ్వరినీ అగౌరవపరచవద్దు. అందరినీ గౌరవించు. ఆత్మవిశ్వాసంతో జీవించు. ఆత్మగౌరవాన్ని అభివృద్ధి చేసుకో. తప్పక నీవు ఉన్నతస్థితిని పొందుతావు" అని బోధించింది. తల్లి మాటలననుసరించి లింకన్ అందరినీ గౌరవించడం నేర్చుకున్నాడు. పరులను గౌరవించి, వారినుండి గౌరవాన్ని అందుకున్నాడు. క్రమక్రమేణ మంచిపేరు తెచ్చుకొని అమెరికా ప్రెసిడెంటు అయ్యాడు. వీధిదీపాల దగ్గర చదువుకున్న ఒక బీదబాలుడు అమెరికా ప్రెసిడెంటు ఎలా కాగలిగాడు? ఆత్మగౌరవాన్ని పోషించుకోవడంచేతనే అంతటి ఉన్నతస్థితికి చేరుకోగలిగాడు.

**'మొదలు అమ్మకు...'**

తల్లిదండ్రులు ఎన్నో కష్టనష్టములను సహించి పిల్లల్ని పోషిస్తారు. కాబట్టి, తల్లిదండ్రులకు తగినరీతిగా కృతజ్ఞత చూపించాలి. కృతజ్ఞత లేనివాడు క్రూర మృగముతో సమానుడు. పూర్వం రంగూన్ యుద్ధంలో అనేకమంది మరణించారు. ఎంతోమంది నిరాశ్రయులైనారు. ఒక తల్లి తన కుమారుణ్ణి వెంటపెట్టుకొని ఎలాగో మద్రాసుకు చేరుకుంది. తినడానికి తిండి లేక, త్రాగడానికి నీరు లేక వాళ్ళు బాగా నీరసించిపోయారు. తల్లి కుమారుణ్ణి ఒకచెట్టుక్రింద కూర్చోబెట్టి, 'నాయనా! మనకీవిధమైన దుర్గతి పట్టిందని

sri sathyasai vahini

విచారించ వద్దు. దిక్కులేనివారికి దేవుడే దిక్కు. దేవుడే మనలను సంరక్షిస్తాడు. కాబట్టి, నీవు దైవచింతన చేస్తూ ఉండు' అని చెప్పి ఇంటింటికీ పోయి భిక్షమెత్తి అన్నము తెచ్చింది. ప్రతి రోజూ అన్నము తెచ్చి పిల్లవానికి పెట్టడం, మిగిలితే తాను తినడం, లేకపోతే పస్తుండడం... ఈరీతిగా కొంతకాలం జరిగేటప్పటికి ఆమె బాగా చిక్కిపోయింది. తల్లియొక్క అనారోగ్యపరిస్థితిని గుర్తించి కుమారుడు ఒకనాడు, 'అమ్మా! ఈరోజు నేను భిక్షాటనకు వెళతాను. నీవు విశ్రాంతి తీసుకో' అన్నాడు. ఆనాటినుండి ఆ పిల్లవాడు ఇంటింటికీ వెళ్ళి భిక్షమెత్తి మొదలు తల్లికి పెట్టేవాడు. మిగిలితే తాను తినేవాడు, లేకపోతే పస్తుండేవాడు. తల్లి అడిగితే తాను ముందే తిన్నానని అబద్ధం చెప్పేవాడు. క్రమక్రమేణ అతని ఆరోగ్యం కూడా క్షీణించింది. నడవడానికి కూడా శక్తి లేకపోయింది. ఒకరోజున ఒక ఇంటిముందు నిలబడి 'భవతి భిక్షాం దేహి' అన్నాడు. నీరసంచేత నోటినుండి మాటలు సరిగా రావడం లేదు. ఆ ఇంటి యజమాని వరండాలో 'ఈజీ ఛైర్'పై కూర్చుని పేపరు చదువుకుంటున్నాడు. ఆ పిల్లవానిని చూసి జాలిపడి లోపలికి వెళ్ళి ఆకులో ఇంత అన్నం తెచ్చి, "నాయనా! నీవు భోజనం చేసి ఎన్ని రోజులైందో! చాలా నీరసంగా ఉన్నావు. కాబట్టి, ఇక్కడే కూర్చుని భుజించు" అని చెప్పాడు. 'లేదు, నేను ఇంటికి తీసుకువెళతాను' అన్నాడా పిల్లవాడు. ఆయనకు కోపం వచ్చింది. 'నీకు నిజంగా ఆకలైతే ఇక్కడే తినవచ్చు కదా!' అన్నాడు. 'అయ్యా! ఇది నాకు కాదు. నా తల్లి చాలా బలహీనంగా ఉన్నది. మొట్టమొదట నా తల్లికి పెట్టాలి' అన్నాడు. నీరసం చేత అతనికి తల తిరిగినట్లైంది. "మొదలు అమ్మకు... మొదలు అమ్మకు," అంటూ క్రిందపడి ప్రాణం విడిచాడు. కుమారుని మరణవార్త విని తల్లి, 'నాయనా! తల్లికోసం ప్రాణం విడిచే నీవంటి సత్పుత్రులు ఈ లోకంలో చాలా అరుదుగా ఉంటారు. నీవొక యోగివి. నీకు సద్గతి కలుగుగాక!' అంటూ ఆమె కూడా ప్రాణం విడిచింది. తల్లికోసం కుమారుడు, కుమారునికోసం తల్లి ఇరువురూ ప్రాణత్యాగం చేశారు. ఇలాంటి పవిత్ర జీవులవల్లనే జగత్తు ఇంతకాలము సుస్థిరంగా నిలువ గల్గింది. 'జగతియందు పుణ్యపురుషులు లేకున్న జగములెట్లు వెలుగు పగలుగాను?' ఈ దేహానికి తల్లియైన ఈశ్వరమ్మకూడా స్వామి విషయంలో అనేక కష్టాలను ఎదుర్కోవలసివచ్చింది.

srisathyasaivachanamrutam

**ఈశ్వరచంద్ర విద్యాసాగర్**

ఈశ్వరచంద్ర విద్యాసాగర్ గొప్ప పండితుడు. అతనుకూడా చాలా బీద కుటుంబంలో జన్మించాడు. తల్లి ఎన్నో శ్రమలకోర్చి అతనిని పోషిస్తూవచ్చింది. అతను కష్టపడి చదివి ఉన్నతవిద్యలో ఉత్తీర్ణుడై మంచి ఉద్యోగం సంపాదించాడు. తల్లిని సంతోషపెట్టడమే తన ప్రధాన కర్తవ్యంగా భావించాడు. ఒకనాడు తల్లి పాదాలపై పడి, 'అమ్మా! నీ ఆశీర్వాదమువల్లనే నేనింతటి ఉన్నతస్థితికి వచ్చాను. నా సంపాదనతో ఏకించిత్తైనా నీకు సేవ చేయాలని ఉంది' అన్నాడు. అప్పుడా తల్లి ఏమి కోరింది? ఈశ్వరమ్మ కోరినట్లుగా, 'నాయనా! మన గ్రామంలో పిల్లలకు జ్వరం వస్తే ఇంత మందిచ్చే వారు లేరు. కాబట్టి, ఒక చిన్న హాస్పిటల్ కట్టించు,' అని కోరింది. హాస్పిటల్ కట్టించి అతను తల్లికోరిక నెరవేర్చాడు. ఎవరు మంచి కార్యములు చేస్తుంటారో వారిపై దైవానుగ్రహం నిండుగా, దండిగా ఉంటుంది. కొంతకాలానికి అతనికి ఉద్యోగంలో 'ప్రమోషన్' వచ్చింది.

మరొకరోజున విద్యాసాగర్, 'అమ్మా! నీకేమైనా కోరికలుంటే చెప్పు,' అన్నాడు. 'మన గ్రామంలో మంచినీటి సౌకర్యం లేక నాబోటి వృద్ధస్త్రీలంతా కష్ట పడుతున్నారు. కాబట్టి, ఒక బావిని త్రవ్వించు నాయనా,' అని కోరింది. తన దగ్గరున్న డబ్బుతో బావిని త్రవ్వించి తల్లిని సంతోషపెట్టాడు. మరి కొంతకాలమైన తరువాత, 'అమ్మా! నీకింకా ఏమైనా కోరికలున్నాయా?' అని అడిగాడు. 'నాయనా! ఒక చిన్న స్కూలు కూడా నిర్మిస్తే పిల్లలు చదువుకొని అభివృద్ధికి వస్తారు,' అన్నది. విద్యాసాగర్ వెంటనే ఒక స్కూలుని కట్టించాడు. తల్లి ఎంతో ఆనందంతో కుమారుణ్ణి కౌగిలించుకొని, 'నాయనా! తల్లికి ఇంతకంటే ఆనంద మేమున్నది? ఈనాటితో నాకోరికలన్నీ తీరినాయి. నీవంటి సత్పుత్రుడు ఒక్కడున్నా చాలు. నీవలన మన వంశమే ఉద్ధరింపబడింది,' అన్నది.

**విద్యకు వినయమే భూషణం**

క్రమక్రమేణ విద్యాసాగర్‌యొక్క పేరుప్రతిష్ఠలు పెరుగుతూ వచ్చాయి. ఒకనాడొక పల్లెలో అతని ఉపన్యాసం ఏర్పాటు చేయబడింది. ఆ పల్లెకు అతను రైలులో ప్రయాణమై వెళుతున్నాడు. అతని ఉపన్యాసం వినాలని ఒక ఆఫీసరు కూడా అదే రైలులో

sri sathyasai vahini vachanamrutam

ప్రయాణమయ్యాడు. ఆయన విద్యాసాగర్ పేరైతే విన్నాడుగాని, అతనినెప్పుడూ చూసి ఎరుగడు. ఆయన చేతిలో ఒక చిన్న పెట్టె ఉన్నది. రైలు దిగిన తక్షణమే ఆయన, 'కూలీ, కూలీ' అని అరవడం ప్రారంభించాడు. అది గమనించి విద్యాసాగర్ పెట్టెను తాను మోసుకొని వస్తానన్నాడు. ఆ ఆఫీసరు విద్యాసాగర్‌ని చూసి ఎవరో కూలీ అనుకొని అతని చేతికి పెట్టెనిచ్చాడు. గమ్యస్థానము చేరిన తరువాత కూలీ ఇవ్వడానికి పర్సు తీశాడు. 'నాకు కూలీ అక్కర్లేదు. ఇదొక సేవగా నేను భావిస్తున్నాను,' అని చెప్పి విద్యాసాగర్ అక్కడి నుండి నిష్క్రమించాడు. తరువాత ఆ ఆఫీసరు విద్యాసాగర్ ప్రసంగాన్ని వినడానికి వెళ్ళాడు. తన పెట్టెను మోసిన వ్యక్తికి వేదికపై అందరూ పూలమాలలు వేసి నమస్కరించడం చూసి ఆశ్చర్యపోయాడు. అతనే విద్యాసాగర్ అని తెలుసుకొని, అంత గొప్ప వ్యక్తితో తన పెట్టెను మోయించినందుకు ఎంతో బాధపడ్డాడు. అతని దగ్గరకు వెళ్ళి, 'నన్ను క్షమించండి,' అని కోరాడు. అప్పుడు విద్యాసాగర్, 'మీ పెట్టెను నేనే అడిగి తీసుకున్నాను కదా! పవిత్ర భారతదేశంలో పుట్టి అంతమాత్రం సేవచేయకపోతే ప్రయోజనమేమిటి? కాబట్టి, మీరు క్షమించమని నన్ను కోరనక్కర్లేదు,' అన్నాడు.

మీకందరికీ తెలిసే ఉంటుంది. గొప్ప విద్యావంతుడైన డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ మన దేశానికి ప్రెసిడెంటుగా ఉండేవాడు. ఆయన కొంతకాలం మైసూరు రాష్ట్రంలో ప్రొఫెసర్‌గా పనిచేశాడు. ఎందరో బీదవిద్యార్థులకు సహాయం చేసి గొప్ప పేరు పొందాడు. ఆయనకి కలకత్తాకు ట్రాన్స్‌ఫర్ అయింది. ట్రైనులో పోవడానికి సామాన్లు సర్దుకుంటున్నాడు. విద్యార్థులు ఆయన ఇంటికి వెళ్ళి సామాన్లను తామే ప్యాక్ చేశారు. వాటిని ఒక జట్కాబండిలో వేసి, 'సార్! దయచేసి మీరు కూడా బండిలో కూర్చోండి,' అని కోరారు. కాని, రాధాకృష్ణన్ ఒప్పుకోలేదు. 'సార్! మీరు కూర్చోక పోతే మేము చాలా బాధపడతామ'ంటూ విద్యార్థులు బలవంతం చేశారు. ఆయన కూర్చున్న తరువాత విద్యార్థులే ఆ జట్కాబండిని స్టేషనువరకు నెట్టుకొని వెళ్ళారు. రోడ్డుపై వెళుతున్నవారు ఆ దృశ్యం చూసి, 'ఎవరీ పెద్దమనిషి? విద్యార్థులు ఈయనను ఇంతగా గౌరవిస్తున్నారే!' అని ఆశ్చర్యపోయారు. ఆ విద్యార్థులు చెప్పారు – "మేము బీదవిద్యార్థులము. వీరు మా గురువుగారు. తాను సంపాదించిన డబ్బు మాకిచ్చి మమ్మల్ని చదివించారు. అందుకు కృతజ్ఞతగా ఈ పని

చేస్తున్నాము.” వాళ్ళు స్టేషను వరకు వెళ్ళి సామాన్లను ట్రైనులో పెట్టి ఆయనకు నమస్కరించి, ‘సార్, మీరు త్వరలో మైసూరుకు తిరిగి రావాలి,’ అని కోరారు. ఆ పిల్లల వినయ విధేయతలకు రాధాకృష్ణన్ ఎంతో ఆనందించాడు.

ప్రాచీనకాలంలో విద్యార్థులు తమ గురువులను, తల్లిదండ్రులను ఎంతగానో గౌరవించేవారు. అట్టి ఆదర్శప్రాయులైన విద్యార్థులుగా మీరు తయారు కావాలి. అప్పుడే మీ జన్మ సార్థకమౌతుంది. మీరు పుట్టింది కేవలం తిండి, తీర్థాదులకోసం కాదు. సేవ చేయాలి. మీరు తినేదాంట్లో ఏదో కొంత బీదలకు పెట్టాలి. దానధర్మాలు చేయని మానవ జన్మ నిరర్థకం. గొప్ప చదువులు చదువుకున్నామని అహంకారపడకండి. మీకంటే గొప్ప చదువులు చదివినవారు ఈ లోకంలో ఎంతమంది లేరు! చదువుకున్నందుకు గౌరవంగా బ్రతకాలి, గర్వం రాకూడదు. మీ సంపాదనతో మిమ్మల్ని మీరు పోషించుకోవడమేగాకుండా బీదలకు తగిన సహాయం చేయాలి. మీరు మరణించినా మీ పేరు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోవాలి. అట్టి ఆదర్శవిద్యావంతులుగా మీరు తయారుకండి. కష్టపడి చదువుకోండి. మీ తల్లిదండ్రులను పోషించండి. పల్లెప్రజలకు తగిన సహాయం చేయండి.

**‘ఆదర్శము చూపించడానికే పాఠశాలకు వెళ్ళాను’**

ఒక చిన్న విషయం. నేను బాల్యంలో ఎన్నో విధములుగా కష్టపడి చదువుకుంటూ వచ్చాను. నాకు చదువులక్కర్లేదు. చదువులలోని సారమంతా నాకు తెలుసు. కాని, ఇతరులకు ఆదర్శము చూపించాలని పాఠశాలకు వెళుతూ వచ్చాను. రాగి సంకటి మూటకట్టుకొని పుట్టపర్తినుండి బుక్క పట్టణానికి నడుచుకుంటూ వెళ్ళేవాడిని. స్కూల్లో కొందరు శ్రీమంతుల పిల్లలుండేవారు. వాళ్ళు అన్నము, రకరకాలైన కూరలు టిఫిన్ క్యారియర్లలో పెట్టుకొని వచ్చేవారు. నావద్ద టిఫిన్ క్యారియర్ లేదు. కనీసం అల్యూమినియం టిఫిన్ క్యారియర్ కూడా లేదు. బట్టలో ఇంత రాగిసంకటి మూట కట్టుకొని నేను బయలుదేరితే గృహము అమ్మాయి (ఈ దేహమునకు తల్లి) “నాయనా! నీకింత అన్నమైనా పెట్టలేక పోతున్నానే,” అని చాలా బాధపడేది. ‘అమ్మా! కడుపు నిండడం

sri sathyasai vahini amrutam

ముఖ్యంగాని, అన్నమైతేనేమి, సంకటైతేనేమి! కాబట్టి, నీవేమీ యోచన పెట్టుకోవద్దు. ఉన్నదానితో మనం సంతృప్తిపడాలి," అని ఎంతో శాంతంగా చెప్పేవాడిని. ఆమె కూడా నన్నెంతో ప్రేమగా పోషిస్తూ వచ్చింది.

పుట్టపర్తిలోని పాతమందిరంలో నేను గడ్డికొట్టం వేసుకొని ఉండేవాడిని. కొంతమంది రౌడీలు, గిట్టనివారు ఒకదినం అగ్గిపెట్టారు. గడ్డికొట్టం మండిపోతున్నది. నేను లోపలే ఉన్నాను. కరణం సుబ్బమ్మ, ఈశ్వరమ్మలు పరుగెత్తుకొని వచ్చి, 'స్వామీ! స్వామీ!' అని పిలిచారు. "నేను బాగున్నాను, మీరేమీ కంగారు పడవద్దు,' అన్నాను. క్షణంలో కుంభవృష్టి కురిసింది. ఎక్కడ? ఆ చిన్న గుడిసెపై తప్ప ఇంకెక్కడా వర్షం లేదు. నేను బయటికి వచ్చిన తరువాత వాళ్ళు, 'స్వామీ, కొట్టమంతా కాలిపోతుంటే మీరు లోపల ఎట్లా ఉన్నారు?' అని అడిగారు. 'అదియే నేనుండవలసిన ప్రదేశము. కష్టములలోనే ఉండాలి నేను, సుఖాన్ని.

*కష్టసుఖములు రెండును కలసియుండు.*<br>
*వీని విడదీయ ఎవ్వరి వశము కాదు*

ఈ లోకములో మంచికి చెడ్డ అడ్డుతగులుతూనే ఉంటుంది. కాబట్టి, మీరేమీ బాధపడవద్దు,' అని చెప్పాను.

**మాతృమూర్తికి స్వామి చేసిన వాగ్దానం**

ఆ రోజుల్లోనే పెద్దపెద్దవాళ్ళంతా వచ్చి స్వామి పాదాలపై పడుతుంటే, వాళ్ళు స్వామిని ఎక్కడికైనా తీసుకుపోతారేమోనని గృహం అమ్మాయి కంగారు పడేది. "ఏమిటి స్వామీ, ప్రపంచమంతా వచ్చి మీ పాదాలపై పడుతున్నదే! మీరు మాత్రం పుట్టపర్తిని వదలి ఎక్కడికీ పోకూడదు,' అని అంటూ ఉండేది. ఒకతూరి మైసూరు మహారాజా, రాణి కార్లలో వచ్చారు. కర్ణాటనాగేపల్లిదగ్గర కార్లను నిలిపి పుట్టపర్తికి వచ్చారు. గృహం అమ్మాయి, 'స్వామీ! ఎవరో పెద్దపెద్దవాళ్ళు కార్లలో వచ్చారు. మిమ్మల్ని తీసుకొనిపోతారో ఏమిటో! మీరు ఎక్కడికీ పోవద్దండి,' అన్నది. "అమ్మా! వాళ్ళకి కార్లున్నాయి. మనకు కాళ్ళున్నాయి. కార్లు చెడిపోవచ్చునుగాని, కాళ్ళు చెడిపోవు. వాళ్లు మేడలలో నివసించవచ్చును. మనకు నిలువడానికి నీడ ఉన్నది చాలు. నేను వాళ్ళవెంట వెళ్ళనులే. నీవేమీ యోచన పెట్టుకోవద్దు,' అని చెప్పి ఆమెను సమాధానపరచాను. అప్పుడామె, 'స్వామీ! మీరు నాకొక మాట ఇవ్వాలి.

sri sathyasai vahamrutam

ఇచ్చేంతవరకు మీ పాదాలు విడువను,' అని చెప్పి గట్టిగా పాదాలు పట్టుకుంది. 'ఏమిటా మాట?' అని అడిగాను. 'మీరు మాట ఇస్తేనే చెబుతాను,' అన్నది. ఆమె చాలా మొండి మనిషి. అయితే, చాలా ప్రేమ కల్గినది. 'సరే, ఏమి కావాలో చెప్పు,' అన్నాను. 'మీరు దేవుడే! ఎంత గొప్పవారైనా మీరు పుట్టపర్తిని మాత్రం వదలకూడదు. ఈ దేహమును వదిలేంతవరకు మీరు పుట్టపర్తిలోనే ఉంటానని మాటివ్వండి,' అని కోరింది. నేను చెప్పాను, 'నేనెప్పుడూ పుట్టపర్తిలోనే ఉండాలంటే, అది చెప్పడానికి వీలుకాదు. అయితే, ఒకటి మాత్రం చెబుతున్నాను. పుట్టపర్తిని వదలి మరొకచోటికి క్యాంపు మార్చను.' నేనీవిధంగా మాటివ్వడంతో ఆమె చాలా ఆనందించి పెరుగన్నం కలుపుకొని వచ్చి నా నోట్లో పెట్టింది. "స్వామీ! ఈనాడు నాకు పెరుగన్నం తిన్నంత ఆనందమైంది. మీరు ఎక్కడికైనా తిరుగవచ్చు, లోకసంచారము చేయవచ్చు. కాని, పుట్టపర్తిలోనే ఉండాలి,' అన్నది. ఆమేరకు నాదగ్గర ప్రామిస్ తీసుకున్నది. ఆమె పోయే సమయంలో ఇక్కడ సమ్మర్‌క్లాసులు జరుగుతున్నాయి. అప్పుడామె మంచి ఆరోగ్యంగానే ఉన్నది. ఒకరోజు ఉదయం ఉన్నట్లుండి, 'స్వామీ! స్వామీ!' అని పిలిచింది. నేను త్వరగా క్రిందికి వెళ్ళాను. వెళ్ళేటప్పటికి ప్రాణం విడిచింది. ఏ రోగమూ లేదు, ఏనొప్పి లేదు. అనాయాస మరణం పొందింది. అంతా క్షణాల్లో జరిగిపోయింది.

**పెద్ద వెంకమరాజు - కొండమరాజు**

ఈ శరీరానికి తండ్రియైన పెద్ద వెంకమరాజు చాలా కష్టజీవి. ఆయనకు పెద్ద బిజినెస్ అంటూ ఏమీ ఉండేది కాదు. చేతిలో పది రూపాయలుంటే భక్తులకోసం టెంకాయలు కొనితెచ్చేవాడు. ఈనాడీ విషయాలన్నీ ఎందుకు చెబుతున్నానంటే, ఇవి విద్యార్థులకు చాలా అవసరం. ఎంతోమంది తల్లిదండ్రులు ఈరీతిగా కష్టపడుతుంటారు. పిల్లలు వాళ్ళకు తగిన సహాయం చేయాలి. ఒకనాడు నేను భక్తులను ఇంటర్వ్యూలకొరకు పిలిచాను. వాళ్ళంతా వచ్చి వరండాలో కూర్చున్నారు. అప్పుడు ఈయన వచ్చి, 'స్వామీ! నాకు రెండు నిమిషాలు టైమివ్వండి,' అని కోరాడు. 'ముందు వీరినందరినీ చూసి పంపిస్తాను,' అన్నాను. 'లేదు స్వామీ, నాకు త్వరగా ఇవ్వాలి,' అన్నాడు. ఆయనకూడా బాగానే ఉన్నాడు. ఏ అనారోగ్యమూ లేదు. కాని, జరుగ నున్నది నాకు తెలుసు. అందుచేత, కొంతమందిని ఆపి ఆయనను లోపలికి పిలిచాను. తన మనస్సులో ఉన్నదంతా నాకు చెప్పి, 'స్వామీ, ఇంత

sri sathyasai vachanamrutam

కాలం ఏవో కష్టాలుపడి టెంకాయలు, వంకాయలు అమ్ముకొని కొంత డబ్బు దాచిపెట్టుకున్నాను. నా దగ్గర ఎక్కువేమీ లేదు. మూడు మూటల బియ్యం, ఒక మూట బెల్లం తీసిపెట్టాను. నేను మరణించిన తరువాత ఆ బియ్యంతో అన్నం వండి బీదలకు దానం చేయాలి,' అని చెప్పాడు. 'దీనికి ఇంత యోచించవలెనా? నేను చేస్తానులే,' అన్నాను. 'స్వామీ! మీరు చేస్తారు. కాని, నా చేతులారా సంపాదించింది నేను ఖర్చు పెట్టాలి,' అంటూ కొంత డబ్బు ఇచ్చాడు. 'నీ డబ్బు నాకెందుకు? నీ దగ్గరే పెట్టుకో,' అన్నాను. 'లేదు, లేదు. నేను ఋణ విముక్తుణ్ణి కావాలి. ఈ డబ్బును చిల్లర చేసి నా శవంపైన చల్లించండి,' అన్నాడు. 'ఎందుకు? నీవు బాగానే ఉన్నావు కదా! ఏమీ యోచన పెట్టుకోవద్దు,' అని చెప్పాను. అక్కడినుండి ఇంటికి వెళ్ళాడు. గృహం అమ్మాయితో మంచినీరు తెప్పించుకొని త్రాగాడు, ప్రాణం విడిచాడు.

పెద్ద వెంకమరాజు తండ్రి కొండమరాజు, ఈ దేహానికి గ్రాండ్ ఫాదర్. ఆయన పరమ భక్తుడు. 112 సం॥లు బ్రతికాడు. ప్రతి రోజు తెల్లవారుజామున పాతమందిరంనుండి క్రొత్తమందిరానికి నడుచుకుంటూ వచ్చేవాడు. ఒకనాడు, 'స్వామీ, నా కోరిక ఒకటి మీరు తీర్చాలి,' అన్నాడు. ఏమిటా కోరిక? అని అడిగాను. 'నేను ఎప్పుడు పోతానో చెప్పండి,' అని అడిగాడు. 'ఆ మాట ఇప్పుడు ఎందుకు? నీవు బాగున్నావు కదా! ఆ సమయం వచ్చినప్పుడు నేను చూసుకుంటానులే,' అన్నాను. 'స్వామీ! మీరు మా వంశములో జన్మించి సత్కీర్తి తెచ్చారు. మీ ఖ్యాతి జగత్తంతా వ్యాపించింది. ఈనాడు అందరూ సాయిరాముణ్ణి పూజిస్తున్నారు. అయితే, ఆనాడు శ్రీరాముడు నోట్లో నీరు పోయకుండానే అతని తండ్రి దశరథుడు ప్రాణం విడిచాడు. దశరథునికి ఆ అదృష్టం లేకపోయింది. కాని, మీరు మాత్రం నాకట్టి ప్రాప్తిని కలిగించాలి. మీరు నా నోట్లో నీరు పోయాలి, అప్పుడే నేను ప్రాణం విడవాలి,' అని కోరాడు. 'సరే, తరువాత చూసుకుందాములే,' అన్నాను.

ఒకనాడు ఆయన మందిరానికి వచ్చి, తరువాత ఇంటికిపోయి పండుకున్నాడు. ఈశ్వరమ్మను పిల్చి, 'సత్యమ్మగుడితట్టు స్వామి వస్తున్నారేమో చూడు,' అని చెప్పాడు. ఈశ్వరమ్మ బయటికి వచ్చి చూసి, 'స్వామి కారులో వస్తున్నారు,' అని చెప్పింది. అప్పుడు

sri sathyasai vachanamrutam

నాకొక చిన్న 'మారిస్ టూరర్' కారు ఉండేది. దాన్ని నేనే డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళే వాడిని. ఇక్కడ ఊర్లోనే కాదు, మద్రాసుకు కూడా వెళ్ళేవాడిని. నేను స్పీడుగా డ్రైవ్ చేసుకుంటూ పోతుంటే, రోడ్డుప్రక్కన ఉన్నవారు ఆశ్చర్యపడేవారు.

కొండమరాజు నేను వస్తున్నానని తెలుసుకొని ఈశ్వరమ్మచేత ఒక టంబ్లరులో నీరు తెప్పించాడు. అందులో ఒక తులసీదళం వేయించాడు. స్వామి తనను పంపించేకోసమనే వస్తున్నాడని ఆయనకు తెలుసు. అది మా ఇద్దరికే తెలుసు, ఇంకెవ్వరికీ తెలియదు. ఆయన టంబ్లరును చేతిలో పట్టుకొని నాకోసం కాచుకున్నాడు. నేను వెళుతూనే, 'స్వామీ, నేను సిద్ధంగా ఉన్నాను,' అన్నాడు. 'నేను కూడా రెడీ,' అన్నాను. ఆ టంబ్లరు పట్టుకొని ఆయనకు కొంచెం నీరు త్రాగించాను. 'స్వామీ, మీ చేతులతో నీరు త్రాగి ప్రాణం వదలడం ఎంత అదృష్టం! ఇంతటి అదృష్టం అందరికీ చిక్కదు. దశరథ మహారాజంతటివాడికే చిక్కలేదు. కాని, నాకు చిక్కింది. నా జన్మ సార్థకమైంది,' అని చెప్పి నవ్వుతూ, నవ్వుతూ కన్ను మూశాడు. ఆ కుటుంబము వాళ్ళంతా అనాయాసంగానే పోయారు. అనగా, మంచికి మంచే జరుగుతుంది. వాళ్ళయొక్క పవిత్రమైన భావములవలన వాళ్ళకన్నీ పవిత్రంగానే జరిగాయి. మీరుకూడా ఎట్టి పరిస్థితిలోను దైవచింతన మానకండి. 'సర్వదా సర్వకాలేషు సర్వత్ర హరిచింతనం' చేయండి. ఆ సమయం వచ్చేసరికి మీకుకూడా సద్గతి ప్రాప్తిస్తుంది.

### నేనెప్పుడూ మాట తప్పను

ఇంక, కరణం సుబ్బమ్మ విషయం చెప్పి నిలిపివేస్తాను. ఆమె చాలా గొప్ప పుణ్యాత్మురాలు. నేను ఉరవకొండనుండి వచ్చిన తరువాత బండ్ల కొలదీ భక్తులు రావడం ప్రారంభించారు. అప్పుడు సుబ్బమ్మ, 'స్వామీ! నాకు బిడ్డలు లేరు. భక్తుల సేవనే భగవంతుని సేవగా భావించుకుంటాను. కాబట్టి, వచ్చినవారందరికీ నేను అన్నం వండి పెడతాను. మీరు మా ఇంట్లోనే ఉండండి,' అని కోరింది. వచ్చిన వారందరికీ భోజనాలు పెట్టేది. ఒకరోజున, 'స్వామీ! మీరింతకాలం మా ఇంట్లో ఉన్నారు. నేను మీకు అన్నం వడ్డించి తినిపించే భాగ్యానికి నోచుకున్నాను. అయితే, నాకొక చిన్న కోరిక ఉంది. నేను మరణించే సమయంలో మీరు నా నోట్లో నీరు పోయాలి,' అని ప్రార్థించింది. 'సరే, నీ కోరిక ప్రకారమే

sri sathyasai vahini

చేస్తాను,' అని ఆమెకు మాటిచ్చాను.

ఒకపర్యాయం నేను పనిమీద మద్రాసు వెళ్ళాను. ఇక్కడ సుబ్బమ్మ మరణించింది. నేను మద్రాసునుండి కారులో తిరిగి వస్తుంటే స్మశానం దగ్గర జనాలున్నారు. 'సుబ్బమ్మ ఎట్లా ఉంది?' అని అడిగాను. 'స్వామీ! నిన్న రాత్రే పోయింది. ఆమెను కాల్చే నిమిత్తమే ఈ కట్టెలను పేర్చుతున్నాము,' అన్నారు. 'ఓహో, అలాగా,' అని కారు త్రిప్పుకొని వాళ్ళింటికి వెళ్లాను.

బుక్కపట్టణంలో ఆమె తల్లి, సిస్టర్స్ ఉండినారు. నన్ను చూస్తూనే వాళ్ళు గట్టిగా ఏడ్చారు. 'స్వామీ! ఇంతకాలము మీ సేవ చేసి, మీ చేతిమీదుగా నీరు త్రాగి ప్రాణం వదలాలని ఎంతో ఆశతో కాచుకున్నది. ఆమెకు ఇంతమాత్రము ప్రాప్తినైనా మీరందించలేక పోయారా? ఆమె చేసిన సేవకు ఫలితం ఇదేనా?' అంటూ నిందాస్తుతి ప్రారంభించారు. 'ఆమె ఏమీ పోలేదు. ఊరకే ఉండండి,' అన్నాను.

ఇంకా పోకపోవడమేమిటి? కన్నులకు చీమలు పట్టాయి, దేహంలో ప్రాణం లేదు. 'ఆమె పోయేసమయంలో నోట్లో నీళ్ళు పోస్తానని మాటిచ్చాను. నేనెప్పుడూ మాట తప్పను,' అని చెప్పి నేనే స్వయంగా ఒక టంబ్లరు నీటిలో తులసీదళం వేసుకొని ఆమె దేహమువద్దకు వెళ్ళి, 'సుబ్బమ్మా! సుబ్బమ్మా!' అని పిలిచాను. కన్నులు తెరచింది. అందరూ ఆశ్చర్యపోయారు. 'సుబ్బమ్మ బ్రతికింది,' అన్నారు. అది బ్రతకటం కాదు, నాకోసం తిరిగి వచ్చింది. నేనామెకు మాటిచ్చాను కదా! ఆ మాటను తీర్చుకోవాలి. అందుకోసం ఆమె తిరిగి వచ్చింది. ఈవిషయం అక్కా చెల్లెళ్ళకు చెప్పాను. వారెంతో ఆనందించారు. నాచేతిలో ఉన్న కర్చీఫ్‌తో చీమలను తుడిచి, గ్లాసుతో నీరు త్రాగించాను. ఆమె నా పాదాలపైన రెండు చేతులూ పెట్టుకుంది. కన్నులు తెరచి నా ముఖాన్ని చూసింది. కంటిధారలు కార్చింది. ప్రాణం విడిచింది. ఈవిధంగా, ఆమెకు సద్గతి కలిగింది.

ఒకసారి నేను మాటిచ్చిన తరువాత ఎన్నటికీ మరువను. ఎప్పటికీ ఆ మాట ప్రకారం నడుచుకుంటాను. దీనిని చాలామంది నమ్మలేరు. 'ఆ... స్వామి ఏదో చెబుతున్నాడులే,' అనుకుంటారు. నా మాట ఎన్నటికీ వృథా కాదు. ఏది చెప్పినా తప్పక చేస్తాను, చేస్తాను, చేస్తాను.

sri sathyasai vacharamrutam

ప్రేమస్వరూపులారా! మీ జన్మ ధన్యం కావాలంటే మీరు దైవచింతన మాత్రం మానకండి. దైవచింతనతోనే మీ జీవితాన్ని అంత్యం చేసుకోండి. స్వామి తప్పక వచ్చి మీకు దర్శనమిస్తారు. కరణం సుబ్బమ్మ మరియు ఈ దేహముయొక్క తల్లిదండ్రులు ఎంతో పవిత్రమైన స్థితిని పొందారు. పూర్వం ఈశ్వరమ్మ వర్ధంతి రోజున నేను సమాధివద్దకు పోయివచ్చేవాడిని. కాని, ఈనాడక్కడికి పోవడానికి దారిలేదు. జనసమ్మర్దము అధికమైపోయింది. అందుకోసమే నేను సమాధికి గుడ్డలు పంపించి అక్కడ పెట్టిస్తున్నాను. ఈనాటివరకు నా మాటను నేను నిలబెట్టుకుంటూనే ఉన్నాను. మాట ఇస్తే నేను ఎప్పుడూ తప్పను.

సత్యంబునందుండి సర్వంబు సృష్టించె
సత్యంబునందణగె సర్వసృష్టి
సత్యమహిమలేని స్థలమేది కనుగొన్న?
శుద్ధసత్వమిదియె చూడరయ్య!

నా పేరు సత్యసాయి. ఈ సత్యమైన మాటను మీరు దక్కించుకోండి. మంచిచెడ్డలు మీ ప్రాప్తిపైన ఆధారపడి ఉంటాయి.

విద్యార్థినీ విద్యార్థులారా! మీ తల్లిదండ్రులపట్ల కృతజ్ఞత చూపండి. అదియే నేను ఆశించేది. మీ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి మిమ్మల్ని సాకినారు. కాబట్టి, వాళ్ళకి తగిన ఆనందమును అందించండి. నాకేమీ అక్కర్లేదు. మీరు మీ తల్లిదండ్రులను సంతోషపెడితే చాలు. అదే నాకు సంతోషము. మీరు అట్టి ఆదర్శవంతులుగా తయారై సత్కీర్తిని సాధిస్తారని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని ముగిస్తున్నాను.

(తేది: 13.04.2003, కేరళ యువత సాధనా శిబిరము, బృందావనం)



sri sathyasai vachanamrutam